క్లుప్తంగా

స్పందన అర్జీలు వెంటనే పరిష్కరించేలా చర్యలు

పొన్నూరు: స్పందనలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల్ని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దారు సూర్యనారాయణసింగ్ తెలిపారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రజల నుంచి పొలం అడంగల్, రోడ్డు మరమ్మతులు, తాగునీటి పైప్ లైన్ ఏర్పాటు తదితర సమస్యలపై తొమ్మిది అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారుల్ని ఆయన ఆదేశించారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభం



పొన్నూరు: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో అసోసియేషన్ ఫర్ వెల్ఫేర్ యాక్టివ్ రూరల్ డెవలప్‌మెంటు ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్‌పీపీ రోడ్డులో ఏర్పాటైన ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని సోమవారం యూనియన్ బ్యాంక్ మేనేజర్ జి. సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర పరిధిలో పొన్నూరు, కాకుమాను, చేబ్రోలు మండలాల ప్రజలకు ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కేంద్ర నిర్వాహకులు వై. రమేష్, పి .రత్నకుమారి మాట్లాడుతూ బ్యాంకింగ్ లావాదేవీలు, డిజిటల్ బ్యాంకింగ్, సైబర్ నేరాలు, ఇన్సూరెన్స్, పెన్షన్ స్కీములు, యూనియన్ బ్యాంక్ సేవల్ని గ్రామస్థాయిలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ భాషకు ఉజ్వల భవిష్యత్



కొమ్మూరు(కాకుమాను): ఉర్దూ భాషకు ఉజ్వల భవిష్యత్ ఉందని, ప్రతి విద్యార్థి నేర్చుకోవాలని ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ.ఖాసిం తెలిపారు. మండలంలోని కొమ్మూరు, కాకుమాను, లింగంగుంటపాలెం గ్రామాలలోని ఉర్దూ పాఠశాలల్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేసి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ సందర్భంగా నో బ్యాగ్ డే సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలను పరిశీలించారు.అనంతరం ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల హాజరు శాతం, జగనన్న గోరుముద్ద కార్యక్రమాల్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మంచాల(చేబ్రోలు): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని యువకుడికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం మంచాలలో సోమవారం జరిగింది. పొన్నూరు పట్టణానికి చెందిన పి. గోపీచంద్ ద్విచక్ర వాహనంపై చేబ్రోలు వైపు వస్తున్నారు. మార్గంమధ్యలో మంచాల గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ప్రమాదవశాత్తూ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో గోపీచంద్ తలకు, కాళ్లు, చేతులకు గాయాలైనాయి. ఆయన్ను 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గుల్జార్ కవిత్వం వైవిధ్యం, కళాత్మకం

లక్ష్మీపురం: కవిగా, రచయితగా గుల్జార్ భిన్న సాహిత్య ప్రక్రియల్లో కృషి చేశారని, ఆయనకు జ్ఞాన్‌పీఠ్ అవార్డు రావడం ముదావహమని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో మనమూ పాడుదాం.. రండి! కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, గాయకులు, కవులు పాల్గొన్నారు. ప్రముఖ గాయకులు రత్నాజీ మాట్లాడుతూ చిత్రసీమలో గుల్జార్ ఆవిష్కరించిన సాహిత్యం ఎంతో విశాలమైంది, విలక్షణమైందని తెలిపారు. ఆయన కవితల నిండా మనిషి, మనస్సు, ప్రకృతి, మానవత్వం కనిపిస్తాయన్నారు. ప్రముఖ రచయిత బి.వి.రమాకుమార్ మాట్లాడుతూ గుల్జార్ రచనలు ఇంగ్లిష్, పంజాబీ, బెంగాలీ, బ్రిజ్, మరాఠి భాషల్లో విశేష ఆదరణ పొందాయని తెలిపారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు బి.అశోక్, గాయకులు భరత్ రెడ్డి, సాయిబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 67 కుటుంబాలు చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: మండలంలోని శేకూరుపాలేనికి చెందిన 67 కుటుంబాలు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరాయి. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పార్టీ కండువా కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులవ్వడంతో పాటు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య చొరవతో వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరక్టర్ కుర్రా పాములు, పెదమస్తాన్, షేక్ జానీ, అహ్మద్, ఎం. పోతురాజు, జి. శ్రీరెడ్డి, కె. మాణిక్యమ్మ, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం

పెదకాకాని: ఢిల్లీలో రైతుల సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమం కొనసాగుతుందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాగ్రాపు సూర్యనారాయణ స్పష్టం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు పిలుపుమేరకు సోమవారం పెదకాకానిలో రైతు, కార్మిక , ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచ వాణిజ్య సంస్థతో కేంద్ర ప్రభుత్వం ఒప్పందాలను కుదుర్చుకోవడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం జాతీయ రహదారులపై దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఒప్పందాల వల్ల దేశవ్యాప్తంగా నిత్యావసర వస్తువులు ధరలు విపరీతంగా పెరుగుతాయని పేర్కొన్నారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ ఢిల్లీ సరిహద్దు రైతు ఉద్యమానికి అందరూ మద్దతు తెలపాలని కోరారు. మద్దతు ధరలు చట్టం చేస్తానని, రైతుకు రెట్టింపు ఆదాయం చేస్తానని హామీ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ దీనికి భిన్నంగా పార్లమెంటులో దొడ్డిదారిన 175 చట్టాలు చేసి వ్యవసాయం, పరిశ్రమల్ని దెబ్బతీసే విధంగా చేస్తున్నారని విమర్శించారు. అనంతరం పెదకాకాని సెంటర్ నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా నాయకులు కంచుమాటి అజయ్, నళినీకాంత్, హనుమంతరావు, పుప్పాల సత్యనారాయణ, దానబోయిన భాస్కరరావు, దండా లక్ష్మీనారాయణ, ఈమని అప్పారావు, కూరపాటి కోటయ్య, ఎం.అరుణ్‌కుమార్, కాకుమాను నాగేశ్వరావు పాల్గొన్నారు.

ప్రారంభ దశలో వ్యాధులకు చికిత్స సులువు



ఆరోగ్య అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

గుంటూరు రూరల్: ప్రాథమిక పరీక్షల ద్వారా మనిషి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి అంచనా వేయవచ్చని ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె. రవి శంకర్ తెలిపారు. ఏఎన్‌యూ, చలపతి ఫార్మసీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం నగర శివారుల్లోని లాం నందున్న ప్రజలకు ఆరోగ్య పరీక్షలు, ఔషధాల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామాల్లో ప్లకార్డులతో ర్యాలీలు జరిపారు. కార్యక్రమంలో రవిశంకర్ మాట్లాడుతూ ప్రారంభ దశలో రోగం గుర్తిస్తే త్వరితగతిన పరిష్కారం పొందవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ జొన్నలగడ్డ, లాం తదితర గ్రామాల్లో తమ కళాశాల విద్యార్థులు వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఆరోగ్య భద్రతపై ప్రజలకు అవగాహన ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.ఎస్. రజనీకాంత్ పాల్గొన్నారు.

గోద్రెజ్ ఐకానిక్ ఎక్స్‌క్లూజివ్ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న గణేషన్ ముత్తుకృష్ణన్ తదితరులు

గుంటూరు రూరల్: పి.ఓబుల్‌రెడ్డి అండ్ సన్స్ 'గోద్రెజ్ ఐకానిక్ ఎక్స్‌క్లూజివ్' నూతన షోరూంను నగర శివారులోని ఇన్నర్ రింగ్ రోడ్డులో సంస్థ సీనియర్ జనరల్ మేనేజర్ గణేషన్ ముత్తుకృష్ణన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ 1948 నుంచి గోద్రెజ్ ఉత్పత్తులను ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కాంచీపురం, తంబారం, సేలం, తిరుచ్చి తదితర నగరాల్లో సరసమైన ధరలకు విక్రయిస్తోందని తెలిపారు. ఫర్నిచర్ ఎంతో మన్నిక, నాణ్యతతో పాటు ఇళ్లకు, ఆఫీసులకు చౌక ధరల్లో లభిస్తున్నాయని వివరించారు. విజయ్ డిజిటల్ గ్రూపు సంస్థల అధినేత జవ్వాది గంగాధరరావు, కంపెనీ ప్రతినిధులు ధర్మేష్, శరత్ మోహన్, నరసింహారావు, జిలాని, ప్రసాద్ తదితరులు ఉత్పత్తుల నాణ్యతను వివరించారు. విశాల మైన నూతన భవనంలో ఐకానిక్ ఎక్స్‌క్లూజివ్ షోరూంను పి.ఓబుల్‌రెడ్డి అండ్ సన్స్ ప్రారంభించడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గుంటూరు బ్రాంచి మేనేజర్ జె.వి.సునీల్‌కుమార్, వినియోగదారులు పాల్గొన్నారు.

మానవాళి రక్షణకు చెట్ల పెంపకం అవసరం



పాఠశాల వద్ద విద్యార్థినులతో సుధీర్‌కుమార్, ధాత్రికుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: భూమిపై మనుషులతో పాటు సకల జీవజాతులు మనుగడ సాగించేందుకు పచ్చని వృక్షాలు ఎంతో కీలకమని గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ కార్యక్రమ నిర్వహణ అధికారి జె.వి. సుధీర్‌కుమార్ తెలిపారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం–2 ఆధ్వర్యంలో జోసఫ్‌నగర్‌లో చేపట్టిన ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా సోమవారం మండల పరిషత్ పాఠశాలతో పాటు పట్టణ ఆరోగ్య కేంద్ర ప్రాంగణంలో మొక్కలు నాటారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధీర్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థినులు నాటిన మొక్కలు రాబోయే రోజుల్లో వృక్షాలుగా ఎదిగి, సమస్త జీవకోటికి ప్రాణవాయువును ప్రసాదిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ అధికారిణి డి.ధాత్రికుమారి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని మహిళకు గాయాలు



ఎస్పీ కార్యాలయం సమీపంలో బోల్తాపడిన ఆటో

పట్నంబజారు: ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి ఆటో బోల్తాపడిన సంఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్కెట్ నుంచి గుజ్జన గుండ్ల వెళుతున్న ఆటో ఎస్పీ కార్యాలయం దాటి కొంత దూరం వెళ్లిన తరువాత కంకరగుంట ఫ్లెఓవర్ దిగి పోస్టాఫీసు వద్ద యు టర్న్ తీసుకుంటున్న ఝాన్సీ అనే మహిళను ఢీకొంది. ఈ క్రమంలో ఆటో బోల్తా పడింది. ఆటోడ్రైవర్ కోటేశ్వరరావు అతివేగంగా వెళుతూ ప్రమాదానికి కారణమయ్యాడని పోలీసులు తెలిపారు. గాయాలపాలైన మహిళ నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్యపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివారల ప్రకారం.. సీతమ్మ కాలనీకి చెందిన తిరుమలకొండ వినోద్ (29) వ్యక్తిగత కారణాలతో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో మరొకరు

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన ఆవుల సాయివిజయ్ (31) అప్పుల బాధ భరించలేక ఈనెల 20న పురుగు మందు తాగాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 24న మృతి చెందాడు. బంధువులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించండి

కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై సూపర్వైజరీ అధికారులు బాధ్యత తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం నగరంలోని రైలుపేట, సీతా రామ్ నగర్, మంగళదాస్ నగర్, ఇజ్రాయిల్ పేట, వెంకట్రావ్ నగర్, సంగడి గుంట, ఐపీడీ కాలనీ, పొన్నూరు రోడ్ తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించి, మౌలిక వసతుల ఏర్పాటుపై పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల బీఎల్ఓల సహకారంతో మౌలిక వసతుల కల్పనపై సూపర్వైజరీ అధికారులు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులకు, వికలాంగులకు, వీలుగా ర్యాంపులు, విద్యుత్, తాగునీటి సరఫరా, మరుగు దొడ్లు వంటి కనీస వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలు ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉంటే వాటి యాజమాన్యాలతో మాట్లాడి ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. పర్యటనలో పలు ప్రాంతాల్లో పోలింగ్ బూత్ గదులు చిన్నవిగా ఉండడం గమనించి, అదే ఆవరణలో పెద్దగా ఉన్న వాటిని ఎంపిక చేయాలని సూచించారు. అనంతరం మంగళదాస్ నగర్ మున్సిపల్ స్కూలులో విద్యార్థులతో కమిషనర్ మాట్లాడారు. అందరు కష్టపడి చదువుకోవాలని, ప్రభుత్వం అత్యుత్తమ సౌకర్యాలు కల్పించిందని తెలిపారు. అనంతరం మౌలిక వసతులు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. ఆమె వెంట సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీ ప్లానర్లు, ఏసీపీలు, టీపీఎస్‌లు, అధికారులు ఉన్నారు.

స్పందనకు సకాలంలో హాజరుకావాలి

స్పందనకు అధికారులు సకాలంలో హాజరుకావాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో నిర్వహించిన స్పందన, సమీక్ష సమావేశానికి హాజరుకాని ఏఈ పవన్, టీపీఎస్ రిజ్వాన, ఈ–1 రంగారెడ్డి, జే4 మోహన్‌రావుకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జగనన్న కాలనీలో హౌసింగ్ రిజిస్ట్రేషన్లు, ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ, గత వారం స్పందనలో అందిన అర్జీల పరిష్కారంపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని విభాగాల అధికారులు ఫిర్యాదు పరిష్కారం కాకుండానే క్లోజ్ చేస్తున్నారన్నారు. ప్రజలు మరలా ఫిర్యాదు రీ ఓపెన్ చేస్తున్నారని, సదరు అర్జీలను విభాగాధిపతే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని కమిషనర్ సూచించారు. నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిపై చర్యలకు సిఫార్స్ చేయాలని ఆదేశించారు.

ప్రజల నుంచి 31 ఫిర్యాదులు

సోమవారం నిర్వహించిన స్పందనలో మొత్తం 31 ఫిర్యాదులు అందాయని కమిషనర్ తెలిపారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి– 11, ఇంజినీరింగ్ విభాగానికి –5, రెవెన్యూ విభాగానికి– 3, ప్రజారోగ్య విభాగానికి– 5, ఉపా సెల్ విభాగానికి –7 ఫిర్యాదులు ఉన్నాయని ఆమె వివరించారు. ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ డి.వెంకటలక్ష్మి, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

కన్నెగంటి హనుమంతుకు ఘన నివాళి



గుంటూరు మెడికల్: స్వాతంత్ర్య సమర యోధుడు కన్నెగంటి హనుమంతు సేవలు ఎంతో విలువైనవని అహల్య ట్రస్టు నిర్వాహకులు, ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్య నిపుణురాలు డాక్టర్ శనక్కాయల రాజకుమారి అన్నారు. కన్నెగంటి హనుమంతు వర్ధంతి సందర్భంగా సోమవారం చుట్టుగుంట సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గుంటూరు జీజీహెచ్ ఏఓగా ప్రతాప్ కుమార్



గుంటూరు మెడికల్: జీజీహెచ్ పరిపాలనా అధికారిగా (ఏఓ) దేవరపల్లి ప్రతాప్‌కుమార్‌ను నియమిస్తూ సోమవారం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆఫీస్ సూపరింటెండెంట్లుగా పనిచేస్తున్న పలువురికి కౌన్సెలింగ్ నిర్వహించి ఏఓలుగా పదోన్నతి కల్పించారు. ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రిలో 1991లో కారుణ్య నియామకం ద్వారా జూనియర్ అసిస్టెంట్‌గా చేరిన ప్రతాప్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్‌గా 1994లో ప్రమోషన్ పొంది నెల్లూరు దొరవారి సత్రానికి బదిలీ అయ్యారు. ఆఫీస్ సూపరింటెండెంట్‌గా 2017లో ప్రమోషన్ పొంది నెల్లూరు ఏసీఎస్ఆర్ మెడికల్ కళాశాలకు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయానికి వచ్చిన ఆయనకు సోమవారం ఏఓగా పదోన్నతి లభించి గుంటూరు జీజీహెచ్‌కు బదిలీ అయ్యారు. కాగా గుంటూరు జీజీహెచ్ ఏఓగా పని చేస్తున్న పూసల శ్రీనివాసరావు రెండు నెలల కిందట అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. నాటి నుంచి ఏఓ పోస్టు ఖాళీగా ఉంది. గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయం ఏఓగా నల్లపాడు రీజనల్ ట్రైనింగ్ సెంటర్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న లక్ష్మీకుమారి నియమితులయ్యారు.

నేడు సిల్వర్ జూబ్లీ బ్లాక్‌కు భూమిపూజ

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి రాక

గుంటూరు ఎడ్యుకేషన్: హిందూ ఫార్మసీ కళాశాల స్థాపించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ భవన నిర్మాణానికి మంగళవారం భూమిపూజ నిర్వహిస్తున్నట్లు చైర్మన్ జూపూడి రంగరాజు తెలిపారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమిపూజకు త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని చెప్పారు. నూతనంగా నిర్మిస్తున్న భవనంలో ఆధునిక సదుపాయాలతో డిజిటల్ లైబ్రరీతో పాటు కంప్యూటర్ ల్యాబ్, పరిశోధన, ప్రయోగశాలల్ని ఏర్పాటు చేసి, జాతీయస్థాయిలో ఉత్తమ ఫార్మసీ కళాశాలగా అభివృద్ధి పరచనున్నట్లు వివరించారు.

ఆవిష్కరణల్లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ

జాతీయ స్థాయిలో అవార్డుకు ఎంపిక



అవార్డు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థుల్లో నెలకొన్న పోటీతత్వంలో తమ కళాశాల విద్యార్థుల నూతన ఆవిష్కరణకు జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి అవార్డు పొందడంతో పాటూ లక్ష రూపాయల నగదు పురస్కారాన్ని అందుకోవడం గర్వకారణమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల బెంగళూరులోని బీఎంఎస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మేనేజ్మెంట్ కళాశాలలో అన్వేషణ ప్రొటోటైప్ కాంపిటీషన్- 2024 పేరుతో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో తమ కళాశాల కెమికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు జి.మనోజ్, ఎస్ఎస్ శ్రీనాగ్, పి.త్రివేణి, కె.త్రివేణి, సి.రాజశేఖర్, ఎం.ప్రసన్న పర్యవేక్షకులుగా ఉన్న అధ్యాపక బృందం డాక్టర్ కె.శోభ, డాక్టర్ జీ కవిత పాల్గొన్నారన్నారు. అడసోర్షన్ ఆఫ్ టెక్స్ టైల్ డైస్ యూసింగ్ బయో ఆక్టివ్ ఫిల్టర్ బెడ్స్ అనే అంశంపై వీరు ప్రదర్శించిన నూతన ఆవిష్కరణకు జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం లభించిందన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ బహుమతి సాధించిన విద్యార్థులు అధ్యాపకులను అభినందించి శాలువాతో సత్కరించారు. కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ దేశ ప్రగతికి పరిశోధనలు కీలకమని, తమ కళాశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటుగా నిరంతరం వినూత్న ఆలోచనలతో విద్యార్థులకు పరిశోధనల ద్వారా నూతన ఆవిష్కరణలకు ప్రోత్సహిస్తూ, అందుకు అవసరమైన సౌకర్యాలను కల్పించడం ద్వారానే జాతీయ స్థాయిలో తమ కళాశాల కీర్తి బావుటా ఎగురవేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ కె.కార్తీక్‌పవన్, డాక్టర్ నాగమల్లేశ్వరరావు, డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్ అభినందించారు.

మానవ మనుగడకు నీటి వనరులు ఎంతో కీలకం



వెంగళాయపాలెంలో విద్యార్థినులతో రవిశంకర్ రెడ్డి, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: మానవ మనుగడకు నీటి వనరులు ఎంతో కీలకమని ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డి.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. బ్రాడీపేటలోని బీహెచ్ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం–1 ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన వెంగళాయపాలెంలో ఏర్పాటు చేసిన వారం రోజుల ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా మంగళవారం నీటి పొదుపు, నీటి వనరుల ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ సకల జీవకోటి మనుగడకు ఆహారం ఎంత అవసరమో, నీరు అంతే అవసరమన్నారు. నీటి వనరుల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. ప్రతి ఇంట్లోనూ ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుని, వర్షాకాలంలో వాన నీటిని అందులోకి మళ్లించడం ద్వారా భూగర్భ జలాల్ని పెంపొందించాలని సూచించారు. భావితరాలకు మనం ఇచ్చే ఆస్తి మంచినీరే అని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారిణి ఎం. గిరిజ, లక్ష్మీదీప్తి, సంధ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహపురంలో ఎన్ఎస్ఎస్ శిబిరం సందర్శన

హిందూ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో గుంటూరు రూరల్ లక్ష్మీనరసింహపురంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరాన్ని సోమవారం ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగ సమన్వయకర్త డి.రవిశంకర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సేవా కార్యక్రమాలను పరిశీలించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పి.వి. రాము, విద్యార్థి సమన్వయకర్త సుశాంత్, నీరజ్, తనుశ్రీ పాల్గొన్నారు.

ఐసీఏఐ గుంటూరు శాఖ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



కార్యవర్గంతో గీత, ప్రసన్నకుమార్, ముప్పాళ్ల శ్రీధర్, సుబ్బారావు, దయానివాస్‌శర్మ

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గుంటూరు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని సోమవారం అమరావతి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎస్ఐఆర్‌సీ చైర్‌పర్సన్ ఏటీ గీత, ఐసీఏఐ కేంద్ర కమిటీ సభ్యులు డి. ప్రసన్నకుమార్, ముప్పాళ్ల శ్రీధర్, దయానివాస్ శర్మ కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ 2024–25లో ఐసీఏఐ గుంటూరు శాఖకు నూతన భవన నిర్మాణాన్ని పూర్తి చేయిస్తామని చెప్పారు. రానున్న సంవత్సరానికి సమగ్ర కార్యాచరణ రూపొందించుకుని గుంటూరు బ్రాంచ్‌ను జాతీయస్థాయిలో ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు.

కార్యక్రమంలో ఎస్ఐఆర్‌సీ కార్యదర్శి ముప్పాళ్ల సుబ్బారావు, ఐసీఏఐ గుంటూరు శాఖ చైర్మన్ నూతలపాటి అమర్‌నాథ్, కార్యదర్శి రుద్రవరపు భరద్వాజ, వైస్ చైర్మన్ చింతా వీఎస్ఎస్ రఘునందన్, కోశాధికారి వనిమిరెడ్డి వెంకట నరేష్, సికాస చైర్మన్ కన్నెగంటి మృత్యుంజయరావు, పాస్ట్ చైర్మన్ మద్ది రవితేజ, కమిటీ సభ్యులు వంగల భార్గవి, సీఏలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెదకాకాని: రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం పెదకాకాని సమీపంలో చోటు చేసుకుంది. విజయవాడ కృష్ణలంకకు చెందిన కృష్ణమూర్తి (38) బైక్‌పై ఆటోనగర్ నుంచి విజయవాడ బయలు దేరారు. పెదకాకాని పల్లాలమ్మ చెరువు సమీపంలోకి చేరుకునే సరికి వెనక నుంచి లారీ వచ్చి ఢీ కొంది. స్థానికులు సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలకు తీవ్ర రక్తస్రావమైన కృష్ణమూర్తిని 108 వాహనంలో గుంటూరు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న కృష్ణమూర్తి పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతుని తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జూదరుల అరెస్టు

పొన్నూరు: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ పి. భాస్కర్ తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో కోతముక్క ఆట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.8,260 స్వాధీన పరుచుకొని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.